అంతులేని సంపదలు

రమణశ్రీ

"మరోసారి చెప్పండి?" కుర్చీలోంచి కొంచం ముందుకి వంగి కుతూహలంగా అడిగాడు ది గ్రేట్ స్మగ్లర్ మస్తాన్.

చిన్నగా మందహాసం చేసాడు ప్రొఫెసర్ ధనంజయ.

గ్లాసులోకి విస్కీ వంపుకొని చప్పరిస్తూ మెల్లగా చెప్పసాగాడు:

"హిందూ మహాసముద్రంలో పశ్చిమంగావున్న సింహాళ ద్వీపం ముత్యాలకు ప్రసిద్ధి అని మీకు తెలుసు. ఆ లంకకు యీశాన్యంగా వెళితే మన్నార్ అఖాతం వస్తుంది. ఆ సముద్రప్రాంతంలో మూడువందల అడుగుల లోతులో లెక్కలేనన్ని ముత్యాలు వున్నాయి. వాటి విలువ అనంతం.

అంతేకాదు, అక్కడి ఇసుకలో 30 శాతం బంగారం వుంది. 50 శాతం వెండి వుంది. ఆ ప్రాంతంలో రత్నాలు, మాణిక్యాలు, మరకతాలు కోకొల్లలు. ఈ సంపదనంతా స్వంతం చేసుకోవడానికి నా దగ్గర ఓ పథకం వుంది" ఓ క్షణం ఆగాడు ధనంజయ.

ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేశాడు మస్తాన్.

"ఇది చాలా ఆశ్చర్యంగా వుంది. ఈ విషయాలన్నీ మీకెలా తెలుసు? వీటినెంతవరకు నమ్మవచ్చునో ఆధారాలున్నాయా?"

"నేను ప్రకృతి శాస్త్రంలో ప్రొఫెసర్ను. గత పదేళ్ళుగా నేను సాగించిన పరిశోధన ఫలితమే యీ వివరాలు. ఈ విషయంలో పొరబాటులేదు. అంతేకాదు, మరో ముఖ్యమైన విషయంగూడా వుంది. ఆ విషయం మీకు తెలిసే వుంటుంది."

"ఏమిటా విషయం?"

"1756వ సంవత్సరంలో సింహాళంనుంచి కొన్ని కోట్ల రూపాయల విలువగల బంగారంతో బయలుదేరిన 'గోల్డ్ షిప్' ఓడ సరిగ్గా యీ మన్నార్ అఖాతంలోనే మునిగిపోయింది. అవునా?"

"ఎస్. యు ఆర్ కరక్టు" చటుక్కున అన్నాడు మస్తాన్.

"అప్పటినుండి చాలామంది ఆ నావ శిధిలాలకోసం, అందులో చిక్కుబడిపోయిన బంగారంకోసం అన్వేషణ సాగించారు. అయితే ఎవరికీ ఆధారాలు కూడా దొరకలేదు. దాంతో ఆ నావ అక్కడకాదు, మరెక్కడో మునిగిపోయుంటుందని తీర్మానించుకున్నారు. ఇక యీ శతాబ్దంలో దానిగురించి ఎవరూ అన్వేషణ జరపలేదు" ఖాళీ విస్కీ గ్లాసు టేబుల్పైపెట్టి కుర్చీలో వెనక్కి

వాలుతూ చెప్పాడు ధనంజయ.

"అయితే ఆ నావ మన్నార్ అఖాతంలోనే మునిగి పోయిందంటారా మీరు?" అడిగాడు మస్తాన్.

"నిస్సందేహంగా! అయితే దాని ఆచూకి తెలుసుకో లేకపోవడానికి చాలా కారణాలు వున్నాయి. ఉదాహరణకు, మీరు ముత్యాలు ఎంత లోతుకు వెళ్ళి సేకరిస్తారు?"

"30 నుండి 40 అడుగుల లోతుకు వెళ్ళి సేకరిస్తాం?"

"కరెక్ట్! అంతకన్నా ఎక్కువ లోతుకు మీరు వెళ్ళలేరు. అసలు ఆ లోతుకు వెళ్ళడమే కష్టంతో కూడుకున్న పని కదా! అదీ సాహసించినా, నవ రంధ్రాల వెంట రక్తం స్రవించి లోపలే మరణిస్తాడు. మరి కేవలం 30 అడుగుల లోతులో అరనిమిషంలో నావ జాడ కనిపెట్టడం ఎంత తెలివి తక్కువ పనో చూడండి. అక్కడి సముద్రం లోతు 300 అడుగులు వుంటుంది. కాలగర్భంలో ఇన్ని శతాబ్దాలు గడిచాక ఆ నావ ఇంకా 30 అడుగుల లోతులోనే వుంటుందనుకోవడం నిజంగా స్టుపిడ్ థింకింగ్. ఆ నావ ఎప్పుడో సముద్ర గర్భంలో అట్టడుగుకు వెళ్ళిపోయి వుంటుంది."

"ఆ నావను ఇప్పుడు చేరుకోవడం సాధ్యమేనా?" ఉత్సాహంగా అడిగాడు మస్తాన్.

"ఆఁ. నా పథకం ప్రకారం 300 అడుగుల లోతులో వున్న ఆ శిథిల నావను చేరుకొని అందులోని బంగారాన్ని పైకి సురక్షితంగా తీసుకురావచ్చు" గర్వంగా చెప్పాడు ధనంజయ.

"ఆ పథకం ఏమిటి? చెప్పండి? కుతూహలంగా అడిగాడు మస్తాన్.

"సారీ, అప్పుడే చెప్పను. మీరు నాతో ఒక ఒప్పం దానికి వస్తే, అప్పుడు నా పథకం మొత్తం వివరించి

చెబుతాను.''

మస్తాన్ ఓసారి అనుమానంగా చూశాడు ప్రొఫెసర్ ధనంజయ వైపు.

''క్షమించాలి, ఒక ప్రశ్న అడుగుతున్నందుకు. ఈ విషయంలో అసలు మీరు నా దగ్గరకు ఎందుకు వచ్చారు?''

చిన్నగా నవ్వాడు ధనంజయ.

''డియర్ మస్తాన్, ఈ పథకాన్ని రచించడమైతే రచించాను కానీ, దానిని విజయవంతం చేయడానికి చాలా మందీ, మార్బలం కావాలి. నన్ను నమ్మి పెట్టుబడి పెట్టగలిగే వ్యక్తి కావాలి. అంతేకాదు, ఆ సంపదను బయటకు చేరవేయడానికి కూడా నాకొక తెలివైన సహచరుడు కావాలి. అందుకే ఆలోచించాను. దీనికి స్మగ్లర్ కింగ్ వైన నువ్వే సమర్థుడవని తోచింది. అందుకే నిన్ను కలిశాను.''

''మరో అనుమానం, మీరు ఎంతో విజ్ఞానవంతులు. మరి మీ పరిశోధనా ఫలితాన్ని ప్రభుత్వంవారికి తెలియచేస్తే, మీకు కావలసిన సహాయం ప్రభుత్వమే చేయగలుగు కదా?''

చిన్నగా నవ్వాడు ధనంజయ.

''మిష్టర్ మస్తాన్, ఈ ప్రశ్నను నువ్వు నిగూఢమైన అర్థంతో అడుగుతున్నావో, అమాయకంగా అడుగుతున్నావో అర్థం కావడంలేదు. నిజమే, యీ పరిశోధనా సారాన్ని ప్రభుత్వంవారికి ఇవ్వొచ్చు. అప్పుడు ప్రభుత్వం ఇచ్చేది ఏమిటి? కేవలం బిరుదులు, సన్మానాలు. కానీ నా పథకం విజయవంతమైతే, ఆ సంపదతో ఒక్క యీ ప్రభుత్వాన్నే కాదు, ప్రపంచాన్నే స్వాధీనం చేసుకోవచ్చు.''

''వెరీనైస్ థింకింగ్ ప్రొఫెసర్ జీ! మీతో నేను ఏ రకంగా సహకరించగలనో చెప్పండి? మీ నిర్ణయాలకు

నేను బద్ధుడనై వుంటాను. ఈ విశ్వ సామ్రాజ్యాధిపత్యంలో నాకూ భాగస్వామ్యం ప్రసాదించండి" మెరుస్తున్న కళ్ళతో అన్నాడు మస్తాన్.

"విత్ ప్లెజర్! ఈ క్షణంనుండి మనిద్దరం భాగసులం. పథకం నాది, పరిశ్రమ నీది, ఫలితం ఇద్దరిదీ. ఓ. కే?"

"ఓ. కే!" షేక్ హాండ్ ఇస్తూ సంతోషంగా అరిచాడు మస్తాన్.

2

"మిష్టర్ మస్తాన్, నా యీ బృహత్పథకం విజయవంతమైతే కష్టానికి లక్షల రెట్లలో ఫలితం వస్తుంది. ప్రపంచంలో సార్థకనామధేయుడ్ని అవుతాను. ఆల్ రైట్ పథకంలోని ప్రాథమిక వివరాలు చెబుతాను వినండి.

మన యీ ప్రయత్నం సఫలీకృతం కావడానికి దాదాపు రెండు సంవత్సరాల కాలం పట్టవచ్చును. ఈ సమయంలో మనతో పూర్తిగా సహకరించడానికి, సముద్రయానంలో సిద్ధహస్తులైన 50 మంది కావాలి. అంతేగాక మన అన్వేషణ విజయవంతంగా కొనసాగించడానికి వీలుగా ఒక జలాంతర్గామి కావాలి.

"వాట్? జలాంతర్గామిని సంపాదించడం చాలాకష్టం కదా?" అడిగాడు మస్తాన్.

చిన్నగా నవ్వాడు ధనంజయ.

"నిజమే! సంపాదించడం కష్టమే! అందుకే స్వయంగా మనమొక సబ్ మెరీన్ ను నిర్మించుకోవాలి. అంతేకాదు, ఒకవేళ సంపాదించకలిగినా ప్రస్తుత జలాంతర్గామి మన కెందుకూ పనికిరాదు. దానికన్నా ఎంతో పటిష్టమైన జలాంతర్గామిని మనం సమకూర్చుకోవాలి. ఎందుకనంటే,

మన ప్రయాణం రహస్యంగా కొనసాగాలి కాబట్టి. ప్రస్తుత జలాంతర్గామిలో అయితే, సముద్రంలో 100 అడుగులకు మించిన లోతులో ప్రయాణించలేము. అంతేకాక, కనీసం మూడురోజుల కొకసారి ఏదైనా హార్బర్‌లో ఫ్యూయల్‌ను నింపుకోవాలి. అది మనకు కష్టతరమైన పని.

అందుకే ఒక పటిష్టవంతమైన జలాంతర్గామిని తయారు చేయడానికి రూపకల్పన చేశాను. అందులో మనం ఎంత కాలమైనా సాగరగర్భంలో ప్రయాణించడానికి అనువైన ఏర్పాట్లు వుంటాయి. అంతేగాక మనం తయారుచేసే సబ్ మెరీన్ సముద్ర గర్భంలో 300 అడుగుల లోతులోనైనా సరే సురక్షితంగా ప్రయాణం సాగిస్తుంది. అవసరమైన ఇంధనాన్ని దానికదే సమకూర్చుకుంటుంది. అయితే ఓడకు వలెనె దీనికిగూడా కొంతమంది సరంగులు కావాలి'' ఓక్షణం ఆగాడు.

ఆశ్చర్యంగా చూశాడు మస్తాన్.

''మనం జలాంతర్గామిని నిర్మించడమా? మీ మాటలు చాలా వింతగా వున్నాయి.''

''ఇందులో వింత ఏమీలేదు మిష్టర్ మస్తాన్! మానవ మేధస్సుకు పనును పెడితే, అది చేయలేని కార్యం వుండదు. మీ చేతనే ఆ జలాంతర్గామిని నిర్మింపచేస్తాను, చూడండి'' చిన్నగా నవ్వుతూ అన్నాడు ధనంజయ.

''ఎలా? వివరంగా చెప్పండి?'' కుతూహలంగా చూశాడు మస్తాన్.

ధనంజయ ప్రక్కనేవున్న ఓ షెల్ఫులోంచి పెద్ద మాప్ తీసి టేబుల్ పై పరిచాడు. ఆ మాప్ పై సబ్ మెరీన్ స్కెచ్ గీసివుంది. పాయింటర్ అందుకుని వివరంగా చెప్పసాగాడు.

''ఇది మనం నిర్మించబోయే జలాంతర్గామి నమూనా

చిత్రం. దీని ఆకారం స్థూలంగా చెప్పాలంటే, సముద్ర జంతువులలోకెల్లా పెద్దదైన 'డాల్ఫిన్' ఆకారంలో వుంటుంది. ప్రకృతిగాలిని పీల్చుకోవడానికి మనం పైకి వచ్చినపుడు, చూపరులకు మన జలాంతర్గామి కేవలం డాల్ఫిన్ లాగానే వుంటుంది. కాబట్టి వారు అనుమానించడానికి ఆస్కారముండదు. అందువలనే ఆ డిజైను ఎన్నుకున్నాను.

జలాంతర్గామి పూర్తిగా ఉక్కుతో తయారుచేయబడుతుంది. దీని పొడవు 116 అడుగులు. వెడల్పు 13 అడుగులు. ఇది 25,000 అడుగుల నీటిని ఆక్రమించుకుంటుంది. ఈ జలాంతర్గామి మొత్తం బరువు 200 టన్నులకు మించకుండా వుండాలి.

జలాంతర్గామిలో ముందువైపు 'వాటర్ బాక్సెస్'ను నిర్మించాలి. వాటిని కావలసినప్పుడు నీటితో నింపడానికి, ఉన్న నీరు ఖాళీ చేయడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. జలాంతర్గామి నీటిలో వుండే స్థితి వాటర్ బాక్సెస్ పై ఆధారపడి వుంటుంది. వాటర్ బాక్స్‌లను నీటితో పూర్తిగా నింపగానే, జలాంతర్గామి సముద్రం లోపలకు మునిగిపోతుంది. తరువాత ఒక్కొక్క తొట్టిని ఖాళీ చేస్తున్నప్పుడల్లా, పైకి తేలుతూ వస్తుంది.

"ఇకపోతే ఈ జలాంతర్గామిని నడపడానికి పెట్రోల్, డీసెల్ వంటి ఇంధనాలను సమకూర్చుకోవడం చాలా కష్టమైన పని. అందుకే జలాంతర్గామిని ఎలక్ట్రిసిటీతో నడపడానికి ప్లాన్ వేశాను." ఒక్క క్షణం ఆగి సిగరెట్ అంటించుకున్నాడు ధనంజయ.

ఆశ్చర్యంగా చూశాడు మస్తాన్.

"వాట్ ప్రొఫెసర్? మీరు మాట్లాడుతున్నది నాకేమీ అర్థం కావడంలేదు. మనకు సముద్ర మధ్యంలో, సాగర

గర్భంలో విద్యుచ్ఛక్తి ఎక్కడినుండి సరఫరా అవుతుంది?" అడిగాడు.

చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ ధనంజయ.

"మెడియర్ మస్తాన్, నేనేమీ సముద్రంలో విద్యుత్కేంద్రం స్థాపించబోవడం లేదు. భూ ప్రపంచంతో సంబంధం లేకుండానే విద్యుత్ను తయారుచేసే విధానం వుంది.

సముద్రపు నీటినుండి ఏమేమి వస్తువులు లభిస్తాయో మీకు తెలుసా? నేను రెండు సంవత్సరాలు నిరంతరం పరిశోధన సాగించి ఆ వస్తువుల గురించిన సమాచారం సంపాదించాను. వాటి ఆధారంగా విద్యుత్ను తయారు చేసుకోవచ్చు. మీకు ఆ ప్రక్రియ వివరిస్తాను చూడండి.

ఒక 100 గ్రాముల సముద్ర నీటిలో 9.65 సెంటి గ్రాముల స్వచ్ఛమైన నీరు, 0.2 సెంటిగ్రాముల క్లోరాయిడ్ వుంటుంది. మిగిలిన దానిలో మెగ్నీషియా, పొటాసియం క్లోరైడ్, మెగ్నీషియం బ్రోమైడ్, సల్ఫేట్, కాల్షియం కార్బనేట్లు వుంటాయి.

విద్యుదుత్పత్తిలో ఎక్కువగా సోడియం క్లోరైడ్ వుపయోగకరమైనది. సోడియంలో పాదరసం కలిపితే తేజస్సు వస్తుంది. మనం కొంత పాదరసాన్ని ఇక్కడి నుండి తీసుకువెళితే అది ఎన్నటికీ తరగదు. సోడియం తరిగినప్పుడల్లా 'సీ' నుండి సంపాదించుకోవచ్చును.

ఇకపోతే, మామూలుగా ఆక్సిజన్ సిలిండర్లను వుపయోగించుకుంటూ ప్రయాణం సాగిస్తాం."

ఆశ్చర్యంగా చూస్తూ వింటున్నాడు మస్తాన్.

"ఇవి స్టీరింగ్ ఫాన్స్. వీటి నుపయోగిస్తూ సబ్ మెరీన్ డైరెక్షన్స్ మార్చుకోవచ్చును. ఈ ఫాన్స్కూడా మనం తయారుచేసే విద్యుత్తోనే పనిచేస్తాయి.

అంతేగాక, జలాంతర్గామి నీటిలో మునిగి వున్నప్పుడు కూడా, మనం పరిసరాలను స్పష్టంగా చూడవచ్చును. అందుకు అనుగుణంగా హై కాన్ సెంట్రేటెడ్ మిర్రర్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

ఇక్కడ ఎలక్ట్రానిక్ రిఫ్లెక్టర్‌ను అమర్చాలి. మనం ఫోకస్ చేసే విద్యుత్ తరంగాలు ఆ రిఫ్లెక్టర్ పైబడి, అవి ప్రతిఫలించి, దాదాపు ఒక కిలోమీటర్ వరకు సాగర గర్భంలో వెలుగును ప్రసరింప చేస్తుంది.”

చకచక చెప్పడం ఆపి గట్టిగా వూపిరి పీల్చుకున్నాడు ధనంజయ.

అప్పటి వరకు ప్రొఫెసర్ సృష్టించిన ఊహా జలాంతర్గామిలో విహరిస్తున్న మస్తాన్ ఉలిక్కిపడి తేరుకుని, ప్రొఫెసర్ వైపు గౌరవంగా చూశాడు.

“యు ఆర్ జీనియస్ ప్రొఫెసర్! మీ మేధాశక్తిని అభినందించడానికి నా శక్తి చాలదు. మీకు ఇంజనీరింగ్‌లో కూడా యింత ప్రావీణ్యముందని వూహించలేకపోయాను” అన్నాడు.

చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ ధనంజయ.

“నేను చాలా కష్టపడి యీ జలాంతర్గామి నమూనాను చిత్రించాను. దీనిని తయారుచేయడం చాలా కష్టమైన పని. ప్రభుత్వానికి తెలియకుండా రహస్యంగా మనకు కావలసిన పరికరాలను సంపాదించడం ఒక ఎత్తు, ఆ పరికరాలతో జలాంతర్గామిని నిర్మించడం ఒక ఎత్తు. ఈపనుకు చాలా హంగుబలం, అర్థబలం కావాలి.”

“ఎస్ ప్రొఫెసర్! ఇంతటి భారీ ప్రయత్నం రహస్యంగా చేయబూనడం, నా జీవితంలోగూడా యిదే ప్రథమం. అయితే కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంటులో నాకు మంచి పలుకుబడివుంది. ఈ ప్రయ

త్నంలో వాళ్ళ సహాయం మనకు కావాలంటే తప్పక దొరుకుతుంది.''

''నో, ఎట్టి పరిస్థితులలోనూ ఈ విషయం, మరొకరికి తెలియడానికి వీలులేదు. మనతోబాటు వచ్చే 40 మంది వ్యక్తులకు సబ్ మెరీన్ బయలుదేరేవరకూ మన పథకం గూడా తెలియగూడదు. ఈ మధ్యలో జరిగేపనులకు గూడా ఆ 40 మందినే మనం ఉపయోగించుకోవాలి.''

''నిజమే! కానీ పై అధికారులకు తెలియకుండా మా వ్యాపారమే ఒక్కరోజుకూడా జరగదు. అలాంటిది, ఇంతటి బృహత్ప్రయత్నం వారికి తెలియకుండా చేయడం సాధ్యపడుతుందా?''

''నిస్సందేహంగా! అది మన దృఢదీక్షపై ఆధారపడి వుంటుంది. జలాంతర్గామి నిర్మాణానికి నేనొక ప్లాన్ వేశాను. ముందు మీరు నలభైమంది వ్యక్తులను సమీకరించండి. రేపు సాయంత్రానికి రెండులక్షల రూపాయల క్యాష్‌గూడా రెడీచేయండి.''

''అలాగే! మీరు వేసిన ప్లాన్ తెలుసుకోవచ్చా?'' కుతూహలంగా అడిగాడు మస్తాన్.

''అది పెద్ద ప్లాన్ ఏమీకాదు. సబ్ మెరీన్ నిర్మాణానికి కావలసిన కొన్ని పరికరాలను నేను ముందే సిద్ధపరిచాను. మిగిలిన కొన్నింటికి జపాన్, మలయా దేశములలోని కంపెనీలకు ఆర్డరిచ్చాను. ఇకపోతే, లక్షదీవులలో ఒకటైన కచాయ్ దీవిని సబ్ మెరీన్ నిర్మాణానికి తగిన ప్రదేశంగా ఎన్నుకున్నాను. అక్కడ యింతవరకు మానవ సంచారమేమీలేదు. అందువలన ముందు రహస్యంగా ఒక్కొక్క పరికరం అక్కడకు చేర్చాలి. ఆ తరువాత నలభైమంది వ్యక్తులు అక్కడకు చేరుకోవాలి. ఈలోగా ఇంపార్టెంట్ మిషనరీకూడా అక్కడకు చేరుతుంది. అన్ని

చేరిన వెంటనే నిర్మాణం ప్రారంభిస్తే, ఒక మాసంలో పూర్తి అవుతుంది. తరువాత అక్కడినుండి మన జలాంతర్గామి జలప్రవేశం చేస్తుంది" చెప్పాడు ధనంజయ.

మస్తాన్ ఆనందంతో ధనంజయవద్ద సెలవు తీసుకొని లేచాడు.

3

ప్రొఫెసర్ ధనంజయ అంచనాల మేరకు, కచాయ్ దీవిలో, నెలరోజులలో జలాంతర్గామి తయారయింది.

మస్తాన్ నాయకత్వంలో నలభైమంది, వివిధ వర్గాలకు చెందిన వ్యక్తులు నిరంతర కృషిచేసి, విలువైన జలాంతర్గామి నిర్మాణంలో పాలుపంచుకున్నారు.

ధనంజయ ఆ నెలరోజులూ విశ్రాంతి అనేది లేకుండా శ్రమించాడు. విదేశాలనుండి యంత్రసామగ్రిని రహస్యంగా తెప్పించడం, వాటిని జలాంతర్గామిగా రూపొందించడంలో ప్రధానపాత్ర వహించడం, రెండుసంవత్సరాల సాగర గర్భయాత్రకు తగిన సదుపాయములు సమకూర్చుకోవడం, అన్నీ ప్రొఫెసర్ దగ్గరవుండి చేయించాడు.

జలాంతర్గామి నిర్మాణం పూర్తి అయ్యేటప్పటికి రెండు న్నర లక్షల రూపాయలు వ్యయమైంది.

ప్రొఫెసర్ ధనంజయ, మస్తాన్, ప్రొఫెసర్ ప్రియురాలు సునీత, మస్తాన్ బేగం ముంతాజ్, ముప్పైమంది సుశిక్షితులయిన సరంగులు, యిద్దరు ఇంజనీర్లు, ఒక డాక్టరు, ఇద్దరు వంటమనుషులు, మొత్తం నలభైమంది జలాంతర్గామిలో ప్రయాణించడానికి సన్నాహాలు పూర్తిచేసుకున్నారు.

జలాంతర్గామి నిర్మాణం పూర్తికాగానే, ఆ దీవిలో చేసుకున్న ఏర్పాట్లన్నింటినీ ఆనవాలుకూడా లేకుండా

ధ్వంసం చేసేశారు.

ఒక శుభ ముహూర్తంలో ప్రొఫెసర్ ఆదేశానుసారం జలాంతర్గామి సముద్రంలోకి ప్రవేశపెట్టబడింది.

"మిస్టర్ మస్తాన్, ఇది మనకు చిరస్మరణీయమైన రోజు. మనం సాధించబోయే ప్రపంచాధిపత్యానికి యిదే పునాది" జలాంతర్గామి క్రమేపీ నీటిలోకి మునిగిపోతుండగా అన్నాడు ధనంజయ.

"అవును ప్రొఫెసర్! నాకు చాలా ఆనందంగావుంది. అంతులేని సంపదకు వారసులం కాబోతున్న మన చెలిమి కలకాలం నిలవాలని ఆశిస్తున్నాను. ఛీర్స్" విస్కీగ్లాసు అందిస్తూ అన్నాడు మస్తాన్.

"వెల్ సెడ్ మస్తాన్! మన ఈ పథకం జయప్రదమైతే, విశ్వ విఖ్యాత చక్రవర్తులం మనమే! ఆల్ రైట్, మీరు మీ బేగంతో మీకు కేటాయించిన రూంలో గడపండి. ఆ గదిలో ఏర్పాటుచేసిన ప్రివ్యూ మిర్రర్స్‌ద్వారా, ఆరోజు నాగదిలో చూసిన చిత్రాలను మరోసారి సజీవంగా దర్శించండి" చెప్పాడు ధనంజయ.

"విత్ ప్లెజర్. థాంక్యూ!" తమ గదిలోకి నడిచాడు మస్తాన్, ముంతాజ్‌ను వెంటబెట్టుకుని.

ధనంజయ ప్రక్కనే కూర్చొనివున్న సునీతవైపు చూశాడు.

సునీత నిశ్చలమైన సముద్ర గర్భంలో జలాంతర్గామి లేపే అలజడిని చూస్తూ ఆనందిస్తోంది.

"సునీ" పిలిచాడు ధనంజయ.

ఉలిక్కిపడి చూసింది సునీత. నవ్వుతూ ధనంజయ కనబడ్డాడు.

"డియర్, ఈ సుందర దృశ్యాలు చూశావా? సముద్ర గర్భంలోకి చొచ్చుకు వస్తున్న సూర్య కిరణాలు ఎలాంటి

వింత కాంతులను వెదజల్లుతున్నాయో! అటు చూడు డియర్, ఆ రంగు రంగుల చేపలు ఎంత నయనానందకరం కావిస్తున్నవో!" పరవశంగా అంది.

చిన్నగా నవ్వుతూ సునీత నడుంచుట్టూ చేతులువేసి దగ్గరకు లాక్కున్నాడు ధనంజయ.

"సునీ, నేను యింత కష్టపడింది ఎవరికోసమో తెలుసా? నేటికి నా కృషి ఫలించింది. నీ కళ్ళలో మెరుపు అనుక్షణం చూడాలనే నా ఆకాంక్ష!" ముద్దుపెట్టుకుంటూ అన్నాడు.

"డియర్, అటుచూడు" చూపించింది సునీత ఒక వైపు భయంగా.

రెండు పెద్ద హ్వేల్ చేపలు జలాంతర్గామిని చూసి అదేదో జంతువనుకొని వేగంగా పరిగెత్తుకు వస్తున్నాయి.

"డోంట్ ఫియర్ సునీ! మన జలాంతర్గామి చుట్టూ అరఫర్లాంగు దూరంవరకు విద్యుత్ వలయం వుంటుంది. ఆ వలయాన్ని ఛేదించుకుని ఏ జంతువూ మనదగ్గరకురాలేదు."

"థాంక్ గాడ్!" గుండెలపై చేతులు వేసుకొని నిట్టూర్చింది.

భీతహరిణిలా చూస్తున్న సునీతను చూడగానే ధనంజయలో ఆవేశం కట్టలు తెంచుకుంది. ఒక్కసారి బలంగా దగ్గరకు లాక్కుని పెదాలు చుంబించాడు.

4

"మిష్టర్ మస్తాన్, కాబిన్‌లోకి వెళదాం రండి" ముందుకు దారితీశాడు ధనంజయ.

మౌనంగా ప్రొఫెసర్‌ను అనుసరించాడు మస్తాన్.

ఇద్దరూ కాబిన్ రూంలోకి నడిచారు.

సరంగుల నాయకుడు జలాంతర్గామి కేప్టెన్ అయిన

రంజిత్ యిద్దర్నీ చూసి అటెంన్షన్‌లో నిలబడి శాల్యూట్ చేశాడు.

"వాట్ మిష్టర్ రంజిత్? ఎలావుంది మూవింగ్?" అడిగాడు ధనంజయ.

"క్వయిట్ వెల్ బాస్! ఇంతకుముందు నేను జలాంతర్గామితో చూడలేనన్ని దృశ్యాలు ఈ సబ్ మెరీన్ ద్వారా చూస్తున్నాను" చెప్పాడు.

"ఆల్ రైట్, సబ్ మెరీన్ పొజిషన్ ఎలావుంది?" అడిగాడు ధనంజయ.

గబగబ మీటర్స్ చూసి చెప్పాడు రంజిత్.

"ప్రస్తుతం 150 అడుగుల లోతులో గంటకు పది మైళ్ళ వేగంతో ఈశాన్యంగా ప్రయాణిస్తోంది బాస్!"

"వెల్! వేగం పెంచండి. మరో నెల రోజులలో మన్నార్ అఖాతం చేరుకోవాలి. ఇకపోతే, ఆక్సిజన్ పొజిషన్ ఎలావుంది?" అడిగాడు ధనంజయ.

"ఇంకా పదహారు గంటలు వస్తుంది బాస్."

"రైట్! సరిగ్గా మరో పధ్నాలుగు గంటలకు వాటర్ బాక్సెస్ ఖాళీ చేయించండి. సబ్ మెరీన్ పైకిరాగానే ఆక్సిజన్ స్టాక్ చేయండి."

"ఓ. కె. బాస్!"

"మిష్టర్ రంజిత్! ఎప్పుడూ మీటర్స్‌ను జాగ్రత్తగా పరిశీలిస్తుండు. ఏవిధమైన అనుమానం వచ్చినా వెంటనే నన్ను కాంటాక్ట్ అవు. ఓ. కె.?" అన్నాడు ధనంజయ.

"అలాగే బాస్!" చెప్పాడు రంజిత్.

"బాస్, మీల్స్ రెడీ!" కుక్ రాబర్ట్ వచ్చి చెప్పాడు ఇంగ్లీషులో.

"థాంక్యూ. పదండి" కిచెన్ వైపు దారితీశాడు ధనంజయ మస్తాన్‌తో.

అంతా భోజనం చేయసాగారు. ప్రొఫెసర్ భోజనం చేస్తూనే మాప్‌ను పరిశీలిస్తున్నాడు. ఇంకా కొన్ని వేల లీగుల (లీగు=3 మైళ్ళు)దూరం ప్రయాణిస్తే కానీ మన్నార్ అఖాతం రాదు.

మన్నార్ అఖాతంగురించిన ఆలోచనలో పడిపోయాడు ధనంజయ.

'అక్కడ తన అంచనా ప్రకారం ఆ నావ శిధిలాలు కనబడకపోతే? తమ శ్రమ చాలావరకు వ్యర్థమైపోతుంది. ఎన్ని వేల ముత్యాలు సేకరిస్తేమాత్రం, ఏంవస్తుంది?'

"ప్రొఫెసర్, ఈ కర్రీ చాలా బాగుంది. ఏమిటది?" అడిగాడు మస్తాన్.

ఆలోచనలనుండి వులిక్కిపడి తేరుకుని రాబర్ట్ వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"అది తాబేలు మాంసంతో వండిన కర్రీ బాస్! ఈ తాబేళ్లు సాధారణంగా ఎక్కడా దొరకవు. ఒక్క స్పెయిన్‌లో మాత్రం ఈ తాబేళ్ళను రాజ వంశీకులు ఎంతో ఖర్చుపెట్టి తెప్పించుకు తింటుంటారు. అక్కడ దీని ఖరీదు వెయ్యిరూపాయలు" చెప్పాడు రాబర్ట్.

"వెరీ ఫైన్, డైలీ ఈ కర్రీ చేయి" మరోవాయి లాగిస్తూ చెప్పాడు మస్తాన్.

"అలాగే బాస్!" చిన్నగా నవ్వాడు రాబర్ట్.

"వాట్ మిష్టర్ మస్తాన్, తాబేలు మాంసం నీకు అంత బాగా నచ్చిందా?" నవ్వుతూ అడిగాడు ధనంజయ.

"అవును ప్రొఫెసర్. మనం తిరుగు ప్రయాణంలో కనీసం ఒకటన్నా తాబేళ్ళనన్నా తీసుకు వెళ్ళాలి" తృప్తిగా త్రేనుస్తూ అన్నాడు మస్తాన్.

అంతలో రంజిత్ గబగబ పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"బాస్, త్వరగా కాబిన్‌లోకి రండి. దూరంగా ఏదో ఓడ సముద్రంలో మునిగిపోతోంది" గాబరాగా అరిచాడు.

భోజనం చేస్తున్న వాళ్ళంతా ఉలిక్కిపడ్డారు. అంతా ఆతృతగా కాబిన్‌లోకి పరుగెత్తారు.

ఓ ఫర్లాంగు దూరంలో పెద్ద ఓడ సముద్రంలో మునిగిపోతోంది. అక్కడ కనబడిన ఓ పెద్ద పర్వతాన్ని చూడగానే జరిగినదేమిటో ప్రొఫెసర్ గ్రహించాడు.

"ఈ ప్రాంతంలో సముద్ర గర్భంలో పెద్దపెద్ద పర్వతాలు చాలావుంటాయి. పాపం దురదృష్టవంతులు, ప్రమాదాన్ని గుర్తించలేకపోయారు" చిన్నగా నిట్టూరుస్తూ అన్నాడు ధనంజయ.

"డియర్, అటుచూడండి. ఇద్దరు మనుషులు యింకా బ్రతికే వున్నట్లున్నారు" ప్రివ్యూ మిర్రర్‌లోకి చూస్తూ అరిచింది సునీత.

"అవును ప్రొఫెసర్ జీ, వారిని రక్షించేమార్గమేమన్నా వుంటే త్వరగా చూడండి" ముంతాజ్ అంది.

ధనంజయ ఏమీ మాట్లాడలేదు. అతని దృష్టి ప్రాణాల కొరకు పెనుగులాడుతున్న ఓడలోని ప్రయాణీకులపైలేదు. 'ఆ ఓడలో బంగారమేమన్నా దొరుకుతుందా?' అని ఆలోచిస్తున్నాడు.

"వాట్ ప్రొఫెసర్? వారిని రక్షించేమార్గం లేదా?" అడిగాడు మస్తాన్.

"కమాన్ మస్తాన్, వెంటనే స్విమ్మింగ్ డ్రెస్ ధరించు. వెంటనే మనం ఆ ఓడ దగ్గరకు వెళ్ళాలి" ప్రక్కనేవున్న మరో గదిలోకి నడుస్తూ అన్నాడు ధనంజయ.

డ్రెస్ చేసుకుంటూండగా చెప్పాడు ధనంజయ.

"డియర్ మస్తాన్, ఇప్పుడా ఓడవద్దకు మనం ఎందుకు వెళుతున్నామో తెలుసా? వారిని రక్షించడానికి కాదు. ఆ ఓడలోవున్న విలువైన వస్తువులను సంపాదించడానికి."

ఆశ్చర్యంగా చూశాడు మస్తాన్.

"అవును మస్తాన్. మన ధ్యేయం ధనాన్ని సంపాదించడం. అంతేగాని అన్యులను రక్షించడంకాదు. సో, ముందే చెబుతున్నాను. మనం సముద్రంలోకి ప్రవేశించిన తర్వాత మాట్లాడటానికి అవకాశం వుండదు. ఓడలోకి ప్రవేశించిన మరుక్షణంనుండి, విలువైన వస్తువుల కొరకు గాలించు. సరిగ్గా గంటలోపుగా తిరిగి జలాంతర్గామిని చేరుకోవాలి. అండర్ స్టాండ్?" చెప్పాడు ధనంజయ.

"ఓ. కె. బాస్!" అన్నాడు మస్తాన్ ఏమీ అనలేక.

మరో అయిదు నిమిషాలలో యిద్దరూ 'సీడోర్' తెరచుకొని సముద్రంలోకి ప్రవేశించారు.

ఇద్దరూ పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ ఓడవైపు నడక సాగించారు. అంతకుముందే సముద్రంలో నడక రిహార్సల్స్ చేశారు కాబట్టి, యిద్దరికీ కొత్తగా ఏమీ లేదు.

పది నిమిషాలలో ఓడను చేరుకున్నారు.

ఆ ఓడ ఫ్రాన్స్ దేశంది. వాళ్ళు వూహించినట్లు పెద్ద విలువైన వస్తువులతో ఆ ఓడ రావడంలేదు. కేవలం పాసింజర్ ఓడ.

'ఏంచేద్దాం?' అన్నట్లు సైగచేశాడు మస్తాన్.

ఓడలోపల అంతా పరిశీలనగా చూశాడు ధనంజయ. ఎక్కడ చూసినా శవాలే! దాదాపు వందమందివుంటారు. కొందరు ఇంకా కొనవూపిరితో మృత్యువుతో పోరాడుతున్నారు. ఒక్కరుగూడా ప్రాణాలను దక్కించుకొన్నట్లులేదు.

శవాలవైపు చూశాడు. అంతా ధనవంతులే కాబోలు,

ఒక్కొక్కరివద్ద చాలా బంగారపు వస్తువులు వున్నాయి.

గబగబ శవాలవద్దకు నడిచి, వారివంటిపైవున్న వస్తువులను ఒలవడం ప్రారంభించాడు ధనంజయ.

మస్తాన్ కూడా ధనంజయను అనుసరించాడు.

అరగంటలో సేకరించకలిగినన్ని వస్తువులు సేకరించి వెంట తెచ్చుకున్న తోలుసంచులలో భద్రపరిచారు.

'యిక వెళదాం' అన్నట్లు సైగచేసి ఓడలోంచి ముందుకు నడిచాడు ధనంజయ.

ఫర్లాంగు దూరంలో సబ్ మెరీన్ వూగిసలాడుతూ కన్పిస్తోంది.

సబ్ మెరీన్ వైపు నడుస్తూ వెనక్కు తిరిగి చూశాడు మస్తాన్.

ఓడ మెల్ల మెల్లగా లోపలకు దిగిపోతోంది. ఓడలో చిక్కుబడిపోయిన శవాలు కొన్ని అలాగే ఓడతో శిథిలమై పోతాయి, కొన్ని శవాలు షార్క్ చేపలకు ఆహారమవుతాయి.

పదినిమిషాలలో సబ్ మెరీన్ చేరుకున్నారు ఇద్దరూ.

సీ డోర్ రాగానే, అక్కడే కనిపెట్టుకొని కూర్చొని వున్న సరంగు చటుక్కున డోర్ తెరచి, ఇద్దర్నీ లోపలకు లాక్కొన్నాడు.

ఇద్దరూ డ్రెస్సింగ్ రూంలోకి నడిచి స్విమ్మింగ్ డ్రెస్ విడిచి, మామూలు దుస్తులు ధరించారు.

"ప్రాణాలతో ఎవరూ లేరా?" గదిలోకి వచ్చి ఆతృతగా అడిగింది సునీత.

"లేరు. అంతా మరణించారు" చెప్పాడు ధనంజయ.

ఇరువురూ తాము తెచ్చిన సొమ్మును రాశిగాపోశారు.

అన్నీ బంగారపు వస్తువులే! వాటి విలువ సుమారు లక్ష రూపాయలు వుంటుంది.

"ఇది మన తొలి సంపాదన" చిన్నగా నవ్వుతూ ప్రకటించాడు ప్రొఫెసర్ ధనంజయ.

ఆ రోజు అంతా ఆనందంగా పెద్ద పార్టీ చేసుకున్నారు.

5

"బాస్, ఒకసారి కాబిన్‌లోకి వస్తారా?" గాభరాగా పిలిచాడు కెప్టెన్ రంజిత్.

"వాట్ మిస్టర్, ఏంజరిగింది??" ఆందోళనగా ప్రశ్నించాడు ధనంజయ.

"దిక్సూచిమీటర్ చెడిపోయింది బాస్! మనం ఏ దిక్కు వైపు ప్రయాణిస్తున్నామో అర్థం కావడంలేదు."

అదిరిపోయారు ధనంజయ, మస్తాన్‌లు.

"మైగాడ్!" అంటూ గబగబ కాబిన్‌లోకి పరిగెత్తారు.

దిక్సూచిమీటర్‌లోని పాయింటర్ నిశ్చలంగా వుంది.

ధనంజయ వెంటనే ఇంజనీర్లను పిలిపించాడు.

అరుణసింగ్ అరోరా, దేవానంద్ బారువా ఇద్దరూ పెద్ద ఇంజనీర్లు. ఇలాంటి విఘాతాలు ముందే వస్తాయని వూహించి, ఆ ఇద్దర్నీ కూడా సబ్‌మెరీన్‌లో వుంచాడు ధనంజయ.

అరోరా, బారువాలు ఆ మీటర్‌ను నిశితంగా పరిశీలించారు. దానిలో పాయింటర్ అతుకు పెట్టడానికి వీలు లేకుండా విరిగిపోయింది. ఎన్నివిధాల ప్రయత్నించినా దిక్సూచిమీటర్ బాగుపడలేదు.

ఇంజనీర్లు ఇద్దరూ పెదవి విరిచారు. సబ్‌మెరీన్‌లోని అందరి గుండెలు ఝల్లుమన్నాయి.

"మిస్టర్ అరోరా, ఆ మీటర్ బాగుపడే వుపాయం లేదా?" అడిగాడు ధనంజయ.

"లేదు బాస్! అన్నివిధాలా ప్రయత్నించాం. మీరూ

ప్రయత్నించి చూడండి” చెప్పాడు అరోరా.

ధనంజయ కూడా ఆ మీటర్‌ను బాగుచేయడానికి ప్రయత్నించాడు. కానీ సాధ్యపడలేదు.

“వాట్ ప్రొఫెసర్, ఇప్పుడెలా?” కంగారుగా అడిగాడు మస్తాన్. అందరి కళ్ళు జాలిగా ధనంజయవైపే చూస్తున్నాయి.

ధనంజయ గొంతు సవరించుకుని గంభీరంగా చెప్పాడు.

“డియర్ ఫ్రెండ్స్! నట్టనడి సముద్రంలో మన దిక్సూచి మీటర్ చెడిపోయింది. ఇది చాలా అనూహ్యమైన పరిణామం. దీనికి ప్రత్యామ్నాయ పద్ధతి కూడా ప్రస్తుతం మనదగ్గర లేదు. ఇప్పుడు సబ్‌మెరీన్ ఏ దిక్కున ప్రయాణిస్తోందో కూడా తెలియదు. మనం సాగర గర్భంలో దారి తప్పాం. తిరిగి గమ్యాన్ని చేరుకోవడం కష్టమే కావచ్చు. అయితే అధైర్యపడక, ధైర్యంతో దేవునిపై భారమేసి ప్రయాణాన్ని సాగిద్దాం.”

ఎవరూ ఏమీ మాట్లాడలేదు. అందరి గుండెలలో సముద్రం ఘోష పెడుతోంది.

‘ఏమిటీ వైపరీత్యం? తిరిగి మనదేశం చేరుకోగలమా? ఈ నట్టనడి సముద్రంలో ఏవైపు ఎంతదూరం ప్రయాణిస్తే భూభాగం తగులుతుంది. అసలు భూప్రదేశాన్ని చూడగలమా?’ అందరి హృదయాలలో ప్రశ్నల పరంపరల పరవళ్ళు తొక్కుతున్నాయి.

“ప్రొఫెసర్, నాదొక సలహా” కొంచం ఆగాడు మస్తాన్.

“చెప్పండి!” ప్రోత్సహించాడు ధనంజయ.

“మనం మన ప్రయాణాన్ని కట్టిపెడదాం. లేకపోతే అనంతమైన యీ సాగర గర్భంలో ఎంతదూరమని దారి తెన్నూ లేకుండా ప్రయాణించగలం. అందుకే మన

ప్రయాణాన్ని విరమించి, సముద్రపు ఉపరితలంపై ప్రయాణం సాగిద్దాం. దైవవశాత్తూ ఏ విదేశీ నావయినా మనకు కనబడకపోదు. వారి సహాయాన్ని అర్థించి, మన దేశానికి వెళ్ళిపోదాం.''

ధనుంజయ ఏమీ మాట్లాడలేదు. అతని మస్తిష్కంలో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

'తన పదేళ్ళ పరిశోధనా సారం దిక్సూచిమీటర్‌లో లోపంవలన విఫలం కావలసిందేనా? మన్నార్ అఖాతంలో మరుగున దాగివున్న అనంతమైన సంపద తమకు లేకుండా పోవడమేనా? ఇంత కష్టపడి ప్రణాళిక వేసుకున్న యీ ప్రయాణం విఫలమైతే, తామీ జన్మలో మళ్ళీ ప్రయాణ సన్నాహాలు చేసుకోలేరు. ఎలా? ప్రయాణం విజయవంతం కావాలంటే ఏం చేయాలి?'

ధనంజయ మనసులో ఓ వ్యూహం తలుక్కుమంది.

''డియర్ ఫ్రెండ్స్! కేవలం సాంకేతికపరమైన, అందులోనూ దిక్సూచిమీటర్ లోపంవలని, మన బృహత్పథకం దెబ్బతినగూడదు. మనం సర్వం త్యజించి యీ ప్రయాణానికి సిద్ధపడ్డాం. అయితే అఖండమైన సంపదను అందుకోవడం, లేదా యీ సాగర గర్భంలోనే కలిసిపోవడం! అంతేగానీ, వెనుతిరిగి వెళ్ళిపోవడమనేది లేదు'' స్థిరంగా చెప్పాడు.

''అదికాదు ప్రొఫెసర్, కనీసం మన్నార్ అఖాతం చేరుకొనే అవకాశం కూడా లేదుకదా? కనీసం ముందు సంపదనన్నా చేజిక్కించుకుంటే, బయటపడే మార్గాన్ని ఆలోచించే పని'' నిరుత్సాహంగా అన్నాడు మస్తాన్.

''అవును. ఇందాకటినుండి ఆ విషయమే ఆలోచిస్తున్నాను. మన్నార్ అఖాతం చేరుకోవడానికి నాకో మార్గం కన్పిస్తోంది'' చెప్పాడు ధనంజయ.

"ఏమిటా మార్గం?" అంతా ఆత్రుతగా ప్రొఫెసర్ వైపు చూశారు.

"ఇప్పుడు సరిగ్గా టైం పదిగంటలయింది. తెల్లవారే వరకు మన ప్రయాణాన్ని నిలుపుదలచేద్దాం. సూర్యోదయానికి ముందుగానే జలోపరి భాగానికి చేరుకొని సూర్యోదయాన్ని పరిశీలిద్దాం. తద్వారా దిక్కులను నిర్ణయించుకొని మన్నార్ అఖాతంవైపు ప్రయాణం సాగిద్దాం. దైవం అనుకూలిస్తే, మనం గమ్యం తప్పకుండా 'మన్నార్' చేరుకోవచ్చు."

ప్రొఫెసర్ మాటలు వినగానే అందరిలో నూతనోత్సాహం చిందులు వేసింది.

"వెల్ బాస్! మీ ఆలోచన అమోఘంగా వుంది. ప్రస్తుత పరిస్థితులలో అంతకన్నా గత్యంతరంలేదు" ఇంజనీర్ బారువా అన్నాడు.

అంతా ధనంజయతో ఏకీభవించారు.

"ఆల్ రైట్ రంజిత్! వెంటనే వాటర్ బాక్సెస్‌ను ఖాళీ చేయించండి" ఆజ్ఞాపించాడు ధనంజయ.

రంజిత్ తలవూపి సరంగులవద్దకు నడిచాడు.

అంతా తమ జీవితాలు ఏమవుతాయోనన్న భయాందోళనల తెరలమధ్య మన్నార్ అఖాతంలో బంగారపు కాంతులను వూహించుకొంటూ తమ తమ గదులలోకి నడిచారు.

6

"ఏమిటి ప్రొఫెసర్, వ్రాస్తున్నారు?" ప్రొఫెసర్ గదిలోకి వచ్చి అడిగాడు మస్తాన్.

"ఏంలేదు మిస్టర్ మస్తాన్, ఓ పుస్తకం వ్రాస్తున్నాను. మనం ప్రయాణం ఆరంభించిన నాటినుండి జరిగిన విశేషాలను పుస్తక రూపంలో భద్రపరుస్తున్నాను."

"దానివలన ఉపయోగం?" అయోమయంగా అడిగాడు మస్తాన్. అతనికి పుస్తకాల గొడవ తెలియదు. ఎందుకంటే అతనేమాత్రం విద్యావంతుడు కాదు. సాధారణ నావికుడుగా జీవనం ప్రారంభించి స్మగ్లింగ్‌లో కాలూని కోట్లు గడించాడు.

చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ ధనంజయ.

"ప్రతి పనికి ప్రయోజనం వెంటనే కన్పించదు మిస్టర్ మస్తాన్. ఈ పుస్తకం వ్రాయడంవలన ప్రస్తుతానికి కాలక్షేపం జరుగుతుంది. కొన్ని సంవత్సరాల తరువాత మళ్ళీ యీ పుస్తకంలోని పుటలు తిరగవేస్తూంటే, గత స్మృతుల అలలపై తేలిపోవచ్చు."

"నిజమే ప్రొఫెసర్! ఏలాగైనా మీ ఆలోచనలు వేరు. నా ఆలోచనలు వేరు" చిన్నగా నవ్వాడు మస్తాన్.

ఆ దేసమయంలో జలాంతర్గామి ఒక్కసారిగా భూకంపం వచ్చినట్లుగా కంపించిపోయింది. ఒక్క కుదుపుతో ఆగిపోయింది. లోపల హాహాకారాలు చెలరేగాయి.

ధనంజయ, మస్తాన్‌లు అదిరిపోయారు. గబగబ కాబిన్‌లోకి పరిగెత్తారు.

రంజిత్ ఒంటినిండా చమటలుపట్టి వున్నాయి.

"వాట్ మిస్టర్ రంజిత్? వాట్ హేపెండ్?" కంగారుగా ప్రశ్నించాడు ధనంజయ.

"అటు చూడండి బాస్! జలాంతర్గామి ఏదో చిన్న కొండను ఢీకొంది. ఇంతకుముందునుండీ కూడా మార్గం చాలా అస్తవ్యస్తంగా వుంది. అయినా ఎంతో జాగ్రత్తగా నడుపుకు వస్తున్నాను."

"థాంక్ గాడ్!" తృప్తిగా నిట్టూర్చాడు ధనంజయ.

అయోమయంగా చూశాడు మస్తాన్.

"వాట్ ప్రొఫెసర్? ఓ ప్రక్కన సబ్ మెరీన్ కొండను

ఢీకొంటే మీరు తృప్తిగా నిట్టూరుస్తున్నారేమిటి?"

చిన్నగా నవ్వాడు ధనంజయ.

"మిస్టర్ మస్తాన్, మన కృషి చాలావరకు ఫలించింది. ఇప్పుడు మనం మన్నార్ అఖాతానికి చాలా దగ్గరలో వున్నామన్నమాట!"

"నిజంగా?" ఆనందంగా అడిగాడు.

"నిజం. మన్నార్ అఖాతానికి వెళ్ళే దారే అస్తవ్యస్తంగా వుంటుంది. ఆ దారిలో ప్రయాణించడం చాలా కష్టంగా కూడా వుంటుంది. మనకు కన్పిస్తున్న దారినిబట్టి, మనం మన్నార్‌కు చాలా దగ్గరలోవున్నట్లు అనుకోవచ్చు."

ఇంజనీర్స్ బాసువా, అగోరాలు కాబిన్‌లోకి వచ్చి ప్రొఫెసర్‌కు శాల్యూట్ చేసి నిలబడ్డారు.

"వాట్ ఇంజనీర్స్, జలాంతర్గామి భారీగా దెబ్బ తిన్నదా? లేక మైనర్ రిపేర్ సరిపోతుందా?"

"చాలా చిన్న రిపేర్ బాస్. ఫాన్స్ చెడిపోతే బాగు చేసేశాం. ఇక మళ్ళీ ప్రయాణం కొనసాగించవచ్చు" అన్నాడు అగోరా.

"థాంక్యూ" అభినందించాడు ధనంజయ.

జలాంతర్గామి తిరిగి ప్రయాణం ప్రారంభించింది.

మరో వారంరోజులు ప్రయాణం సాఫీగానే నడిచింది. భూప్రపంచంనుండి బయలుదేరి సరిగ్గా సంవత్సరమయింది.

ఆ రోజు దూరంగా కన్పిస్తోన్న ఓ చిన్న దీవివైపు చూస్తూ సంతోషంగా ధనంజయను పిల్చింది సునీత.

"డియర్, ఆ దీవిలోకి వెడదామా?" అడిగింది.

"ఏమిటంత కోర్కె కలిగింది సునీ?" అడిగాడు ధనం-జయ.

"డియర్ భూమిపై కాలుబెట్టి సంవత్సరమవుతోంది. ఇక్కడి దీవులలో మనల్ని గుర్తించడానికి ఎవరూ వుండరు

కదా! ఒకరోజు ఆ దీవిలో మకాంచేద్దాం ప్లీజ్!" ప్రొఫెసర్ ప్రాధేయపడింది.

"ఆల్ రైట్! అలాగే చేద్దాం" అంటూ కెప్టెన్‌ను పిలిచాడు ధనంజయ.

ధనంజయ ఆదేశానుసారం జలాంతర్గామి దీవికి దగ్గరగా వచ్చి ఆగింది.

గబగబ రెండు పడవలు సిద్ధంచేశారు. ధనంజయ, సునీత, మస్తాన్, బేగం ముంతాజ్‌తో సహా మరో పది మంది నావలపై దీవిపైకి బయలుదేరారు.

దీవిని చేరగానే, అంతా ఆనందంగా ఆ దీవిపై అడుగు బెట్టారు.

అది చాలా చిన్న దీవి. బహుసుందరంగా వుంది. కలలో కూడా చూడని వింత వింత పక్షులు చెట్లపై గంతులు వేస్తున్నాయి. చెట్ల కొమ్మలనిండా తేనె తుట్టెలు నిండుగా వున్నాయి. ఖర్జూరపు కాయలు చెట్లకు విరగబడి కాసి వున్నాయి.

అంతా చేతికందినది తింటూ దీవిలో విహరించసాగారు.

వారి విహారానికి అడ్డు తగులుతూ ఏదో పెద్ద కోలాహలం వినబడింది.

అంతా అదిరిపడి ఆ కోలాహలం వచ్చిన దిక్కువైపు చూశారు.

దాదాపు ఓ నలభైమంది వివస్త్రలయిన సముద్రజాతి వారు చేతిలో బల్లెములతో సందడిచేస్తూ వీళ్ళవైపు పరిగెత్తుకుంటూ వస్తున్నారు.

వాళ్ళను చూడంగానే అందరి ప్రాణాలు పైపైనే పోయాయి.

వాళ్ళు ఎవరో వూహించలేకపోయాడు ప్రొఫెసర్ కూడా!

ఏది ఏమయినా ముందు జాగ్రత్త మంచిది. ఆ వచ్చేది మంచివాళ్ళే కావచ్చు, లేక నరరూప రాక్షసులే కావచ్చు.

"క్విక్. ఆ వచ్చేది మనకు శత్రువులే కావచ్చును. గబ గబ మీ నావలవైపు పరిగెత్తండి" హెచ్చరించాడు ధనంజయ.

అంతా తమ తమ చేతులలోవి క్రింద పడవేసి సముద్రం వైపు పరిగెత్తారు.

పదినిమిషాలలో అంతా నావలపైకెక్కి, నావలను కదిలించారు.

తృప్తిగా నిట్టూరుస్తూ నావలవైపు పరిశీలనగా చూసిన ప్రొఫెసర్ అదిరిపడ్డాడు.

"స్టాప్!" అరిచాడు.

నావలు రెండు ఆగిపోయాయి.

మొత్తం అందరినీ మరోసారి లెక్కబెట్టాడు. ఇద్దరు తక్కువగా వున్నారు. మరోసారి అందర్నీ పరిశీలనగా చూశాడు, ఆ ఇద్దరు ఎవరా అని?

దీవిపైకి వచ్చిన వారిలో ఇద్దరు, ఇంజనీర్స్ బారువా, అరోరా మళ్ళీ నావలు ఎక్కలేదు. అంటే ఆ దీవిపైనే వున్నారన్నమాట!

అంతా తీరంవైపు మళ్ళీ నావలను తిప్పారు.

దూరంగా రెండు ఆర్తనాదాలు వికృతంగా వినబడేటప్పటికి, ఉలిక్కిపడి అంతా ఆ దీవివైపు చూశారు.

నరమాంస భక్షకులైన ఆ గుంపు, ఇంజనీర్లు ఇద్దరినీ క్రూరంగా విరమకొని తినేస్తున్నారు.

"మైగాడ్!" అంతా ఒక్కసారిగా అరిచారు.

"ప్రొఫెసర్, ఏం చేద్దాం?" ఆందోళనగా అడిగాడు మస్తాన్.

"మనం కొద్దిమందే వున్నాం. ఆ నలభైమందిని ఎదిరించడం చాలా కష్టం. ఇక మన మిత్రులమీద ఆశ వదులుకోవడమే! వారి ఆత్మశాంతికోసం భగవంతుణ్ణి ప్రార్థిస్తూ తిరిగి జలాంతర్గామిని చేరుకోవడమే ఉత్తమం" గద్గద కంఠంతో చెప్పాడు ప్రొఫెసర్.

అంతా నావలను తిరిగి వచ్చినదారివైపు మళ్ళించారు. పదిహేను నిమిషాలలో జలాంతర్గామిని చేరుకున్నారు.

ఆ రాత్రి ఎవరికీ నిద్రపట్టలేదు. అనుకోకుండా ఎదురయిన ఆపద అందరినీ భయభ్రాంతుల్ని చేసింది.

చనిపోయిన ఇంజనీర్ల ఆత్మశాంతికోసం అంతా ఐదు నిమిషాలు మౌనం పాటించారు.

7

సూర్యచంద్రులను ఆధారంగా తీసుకొని ధైర్యంగా ప్రయాణాన్ని కొనసాగించారు ప్రొఫెసర్ బృందం.

ఇంజనీర్ల ఘోర మరణ సంఘటన క్రమేపీ అందరి హృదయ ఫలకాలపైనుండి చెరిగిపోతోంది.

అంతా మన్నార్ అఖాతంలో లభించే బంగారాన్ని వూహించుకుంటూ ఉత్తేజితులవుతున్నారు.

మరోవారం రోజులు గడిచాయి.

కాబిన్‌లో కూర్చొని సాగర గర్భంలో విశేషాలు పరిశీలిస్తున్న ప్రొఫెసర్ హఠాత్తుగా లేచాడు. అతని కళ్ళు ఆనందంతో వింతగా మెరిశాయి.

"మస్తాన్!" అరిచాడు గట్టిగా.

కంగారుగా పరిగెత్తుకుంటూ వచ్చాడు మస్తాన్.

"మస్తాన్, మన కృషి ఫలించింది.మన్నార్ అఖాతాన్ని చేరుకున్నాం. ఇక మనకు అడ్డు అన్నది లేదు. ఈ ప్రపంచానికి మనమే కుబేరులం" భుజాలు పట్టుకుని కుదుపుతూ

సంతోషంగా అన్నాడు ప్రొఫెసర్.

"నిజం ప్రొఫెసర్?" కళ్ళలో కాంతులీనుతుండగా అన్నాడు మస్తాన్.

"ఎస్ మిష్టర్ మస్తాన్. అటు చూడండి ముత్యాలు ఎలా కనబడుతున్నాయో?"

ఆత్రంగా చూశాడు మస్తాన్. అతని కళ్ళు తిరిగి పోయాయి.

"అవును ప్రొఫెసర్! అబ్బ! ఎన్ని వేల ముత్యాలు? నా జన్మలో యిన్ని ముత్యాలను చూడలేదు."

"నిజమే మస్తాన్! ఇక ఈ ముత్యాలన్నీ మనవే! ఈ రోజున పరిసరాలను జాగ్రత్తగా పరిశీలించి రేపటినుండి సేకరణ ప్రారంభిద్దాం. మరో ముఖ్యవిషయం, ఈ అఖాతం లోనే కొన్ని కోట్లరూపాయల విలువగల బంగారంతో ప్రయాణిస్తున్న 'గోల్డ్ షిప్' నావ మునిగిపోయింది. ముఖ్యంగా ఆ నావ శిథిలాలను గూడా మనం అన్వేషించాలి" చెప్పాడు ప్రొఫెసర్ ధనంజయ.

"అలాగే ప్రొఫెసర్!" సుందర దృశ్యాలను పరికిస్తూ పరవశంతో అన్నాడు మస్తాన్.

ధనంజయ తగిన సూచన లివ్వడానికి కెప్టెన్ వద్దకు నడిచాడు.

ఈ విషయం జలాంతర్గామిలోనివారి కందరికీ తెలిసింది. అంతా ఆనందంతో పరవశించిపోసాగారు.

8

ఉదయం ఏడుగంటలయింది.

ప్రొఫెసర్ ధనంజయ, మస్తాన్, కెప్టెన్ రంజిత్, మరి ముగ్గురు అనుచరులు సాగరగర్భంలో ముత్యాల సేకరణకు సన్నద్ధులు అయ్యారు.

అంతా స్విమ్మింగ్ డ్రెస్ ధరించారు. ఆక్సిజన్ సిలిండర్స్ భుజాలమీదుగా వీపుకు తగిలించుకున్నారు. నడుం చుట్టూ తోలుసంచులు వ్రేలాడదీసుకున్నారు. సముద్రంలో ప్రత్యేకంగా ఉపయోగించే టార్చిలైట్, తుపాకులను రెడీలో వుంచుకున్నారు.

సాగరగర్భంలోకి ప్రవేశించిన తరువాత తిరిగివచ్చేవరకు మాట్లాడటానికి అవకాశంలేదు.

అందుకే అందరికీ తగిన సూచనలను ముందే ఇచ్చాడు ధనంజయ.

ఏడుగంటల పదిహేను నిమిషాలకు ఆరుగురూ, సీడోర్ తెరచుకొని సముద్రంలో ప్రవేశించారు.

దాదాపు 90 అడుగులు లోపలకు వెళ్ళిన తర్వాత నేల గట్టిగా తగిలింది. బహుశా కొండకావచ్చును. ఎందుకంటే అక్కడ 300 అడుగుల లోతుకూడా వుంది.

ఇక అంతా నడవసాగారు. అందరికీ అది చాలాకొత్త వింత అనుభవం. సముద్రంలో నిర్భయంగా నడుస్తున్నారు, ఆరుగురూ. అందరిదృష్టి పరిసరాలను జాగ్రత్తగా పరికిస్తోంది.

రకరకాల చేపలు, తాబేళ్ళు హడావుడిగా తిరుగుతున్నాయి.

కొద్దిసేపటిలోనే ముత్యాలు పుష్కలంగా దొరికే ప్రాంతానికి చేరుకున్నారు.

ఆ ఎగుడు దిగుడు ప్రదేశంలో నడుచుకుంటూ 150 అడుగుల లోతుకు వెళ్ళిపోయారు.

అక్కడి దృశ్యాలు అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఎవరూ కలలోగూడా వూహించని దృశ్యాలు కళ్ళకు స్పష్టంగా కనబడుతున్నాయి.

ఎక్కడ చూసినా ముత్యపు చిప్పలే! లక్షలసంఖ్యలో

వున్నాయి. అన్నీ పెద్ద పెద్ద ముత్యపు చిప్పలు. అందులోని ముత్యాలు కోట్లుఖరీదు చేస్తాయి.

అంతా అవకాశం ఉన్నంతవరకు ముత్యపు చిప్పలను తోలుసంచులలో భద్రపరచుకున్నారు.

మూడుగంటల సేకరణ పిదప అంతా తిరిగి జలాంతర్గామివైపు బయలుదేరారు.

జలాంతర్గామికి నాలుగువైపులా ఏర్పాటుచేయబడిన ఫ్లడ్ లైట్స్ దేదీప్యకాంతులను వెదజల్లుతూ, సముద్రంలో ప్రవేశించిన వారికి, దారితప్పే ప్రమాదంలేకుండా తోడ్పడుతూ వుంటాయి.

మరో గంటలో ఆరుగురూ జలాంతర్గామిని చేరుకున్నారు.

లోపలకు ప్రవేశించగానే, దుస్తులను మార్చుకొని, తోలుసంచులను క్రింద గుమ్మరించారు.

ఆరుగురూ కలిసి కొన్ని వేల ముత్యపు చిప్పలను సేకరించారు. అంతా కలిసి ముత్యాలను విడదీసి రాశిగా పోశారు.

అంతా ఆ ముత్యాలనుచూసి ఆశ్చర్యపోసాగారు.

సునీత, ముంతాజ్ ల ఆనందానికి మేరలేకపోయింది. సంతోషం పట్టలేక ఆడుతూ, పాడుతూ నృత్యం చేశారు.

ఆ రోజు మొత్తం విశ్రాంతి అనేది లేకుండా నాలుగుసార్లు సాగరగర్భంలో ప్రవేశించి, లక్షల సంఖ్యలో ముత్యపు చిప్పలను సేకరించారు. జలాంతర్గామిలోని ఒక గదినిండా పెద్దరాశి పోశారు.

ఆ రాశితో ప్రపంచంలో సగభాగాన్ని తేలికగా కొనవచ్చును.

అయితే, అందరికిగూడా గోల్డ్ ఫిష్ నావ కనబడకపోవడం చాలా నిరాశను కల్గించింది.

"ప్రొఫెసర్, బహుశా ఆ నావ ఈ ప్రాంతాలలో గాక మరో ప్రాంతంలో మునిగిపోయుంటుంది" అనుమానం వెలిబుచ్చాడు మస్తాన్.

"నో. అలా జరగడానికి వీలులేదు మస్తాన్! ఆ నావ గ్యారంటీగా ఈ పరిసరాలలోనే మునిగిపోయుంటుంది. అయినా మనం దానిగురించి అన్వేషించింది బహుతక్కువ. రేపటినుండి మరికొంచెం ముందుకువెళ్ళి పరిశోధిద్దాం. ఆ నావ కనబడితే చాలు, మన జన్మతరించినట్లే!" ఆశగా అన్నాడు ప్రొఫెసర్.

ఏం మాట్లాడలేదు మస్తాన్. కోట్ల విలువగల ముత్యాలను సేకరించడానికి తోడ్పడిన ప్రొఫెసర్ మాటలు తేలికగా తీసేయడానికి ధైర్యంలేదు. అతనిలోగూడా, ఆ నావ కనబడుతుందేమోనని ఆశగానే వుంది. ఆ ఆశా ప్రపంచంలో విహరిస్తూ ఆ రాత్రికి విశ్రమించారు.

9

మన్నార్ అఖాతంలో ప్రవేశించి అయిదు రోజులు దాటింది.

విశ్రాంతితో గూడా నిమిత్తంలేకుండా ఆ అయిదు రోజులూ గోల్డ్ ఫిష్ నావకోసం అన్వేషణ సాగించారు. అయినా ప్రయోజనం కన్పించలేదు. అఖాతంలో దాదాపు మూడువంతులకు పైగా గాలించేశారు.

ఈ అయిదు రోజులలో గణనీయమైన సంఖ్యలో ముత్యాలను, రత్నాలను, వజ్రాలను సేకరించి జలాంతర్గామిలోని రెండు గదులను పూర్తిగా నింపారు.

ఆ రోజు ఉదయం ఏడుగంటలయ్యేటప్పటికి మళ్ళీ నావకొరకు అన్వేషణకై బయలుదేరారు.

ఆ రోజుతో అన్వేషణకు చివరి రోజు అని, ఇక నాచ జాడలు కన్పించకపోతే, సేకరించిన ముత్యాలతో తృప్తిపడి తిరుగు ప్రయాణానికి నాందిపలకవచ్చని, కాబట్టి మరింత శ్రద్ధగా అన్వేషించమని అనుచరులకు వుత్సాహాన్ని నూరిపోస్తూ తగిన సూచనలిచ్చి ముందుకు నడిచాడు ప్రొఫెసర్ ధనంజయ.

ఈసారి పెద్ద పెద్ద రాతిగుట్టలను దాటుకుంటూ ముందుకు నడక సాగించారు.

హఠాత్తుగా ఓ చోట ప్రొఫెసర్ ఆగిపోయాడు. అతని వెనుక వస్తున్న వాళ్ళుగూడా అర్థంగాక ఆగిపోయారు.

ఒక పెద్ద సొరచేప ఓ రాళ్ళగుట్ట చాటునుండి భీకరంగా నోరు తెరుచుకొని ప్రొఫెసర్ మీదకు వురికింది.

అనుక్షణం అప్రమత్తతతో వుండే ప్రొఫెసర్, ఆ విషయం ముందే గమనించి, తుపాకీని సొరచేపకు గురిపెట్టి కాల్చాడు.

తూటా గురితప్పకుండా వెళ్ళి సొరచేప పొట్టలో దిగింది. వరుసగా ఆరు తూటాలు పేల్చాడు. సొరచేప శరీరం తూట్లుపడిపోగా ప్రాణాలు విడిచింది.

మస్తాన్ ప్రొఫెసర్ వైపు కంగారుగా చూశాడు.

సొరచేప చచ్చిపోయిందంటే, చాలా ప్రమాదం. ఆ రక్తం వాసన చూడగానే బోలెడు సొరచేపలు అక్కడకు చేరుకుంటాయి.

ప్రొఫెసర్ వెంటనే ఏంచేయాలో సైగ చేశాడు.

అంతా సొరచేపను గట్టిగా పట్టుకొని, రక్తం కారుతున్న రంధ్రాలను గుడ్డలతో మూసివేసి, ఆ మృతదేహాన్ని రాళ్ళ గుట్టలమధ్య ఆనమాలు గూడా తెలియకుండా పాతిపెట్టేశారు.

తరువాత ప్రొఫెసర్ తృప్తిగా తలపంకించి ముందుకు నడక సాగించాడు.

కొంతదూరం ప్రయాణించిన తరువాత ఓ పెద్ద లోయ కన్పించింది. అంతా ఆ లోయలోకి తొంగిచూశారు.

అంతే, అందరి కళ్ళు ఆనందంతో తళతళ మెరిశాయి.

ఆ లోయలో ఓ నావ పడిపోయివుంది. ఆ నావ శిధిలావస్థలో వుండి గుర్తుపట్టడానికి గూడా వీలులేకుండా వుంది.

అంతా కష్టపడి ఆ లోయలోనికి దిగి నావ వద్దకు నడిచారు.

ఆ నావ దగ్గరకు చేరుకోగానే అందరి హృదయాలు ఆనందంతో గంతులేశాయి.

అదే నావ! గోల్డ్‌ఫిష్ నావ!

ఒక గుట్టగా పడివున్న ఆ నావ శిధిలమైన రేకులను తొలగించి లోపలకు నడిచారు.

అంతా బంగారమే! పెద్దపెద్ద పెట్టెలనిండా ఇటుకల రూపంలో బంగారపు ముద్దలు తళతళ మెరుస్తున్నాయి.

ఆనందం పట్టలేక అంతా ఒకరినొకరు కౌగలించుకున్నారు.

వీలయినంత బంగారం తీసుకొని వెనక్కు మరలారు.

ఆ రోజు రాత్రి జలాంతర్గామిలో పెద్దగా పార్టీ చేసుకున్నారు. ప్రపంచాన్నే జయించినంతగా తృప్తిపడి ఆనందించారు.

ప్రొఫెసర్, మస్తాన్‌లు తమ ప్రేయసిలతో స్వర్గ సౌఖ్యాలను అనుభవించారు.

గోల్డ్‌ఫిష్ ఓడలోని బంగారం మొత్తాన్ని జలాంతర్గామిలోకి చేర్చడానికి పదిహేను రోజులు పట్టింది. దాదాపు పది టన్నుల బంగారం!

ప్రొఫెసర్ పధకం విజయవంతమయింది. అతని పరిశోధన ఫలించి అంతులేని సంపద వారి హస్తగతమయింది.

మొత్తం బంగారం, ముత్యాలు, రత్నాలు, వజ్రాలతో సబ్ మెరీన్‌లో ఖాళీ లేకుండా నింపేశారు.

అందరి కళ్ళు విజయగర్వంతో మెరుస్తూండగా, మస్తాన్ అఖాతానికి గుడ్ బై కొట్టి, జలాంతర్గామి ముందుకు ప్రయాణించసాగింది గర్వంగా!

10

మస్తాన్ అఖాతాన్ని వదలి మూడు నెలలు దాటుతోంది.

డెక్స్‌మీటర్ చెడిపోయిన కారణంగా, సూర్య చంద్రులపై భారమేసి జలాంతర్గామి దిశలను మారుస్తున్నారు.

ఒక దారీ తెన్నూ లేకుండా ప్రయాణిస్తోంది జలాంతర్గామి.

మరో రెండు నెలలు గడిచాయి.

అప్పటివరకు తృప్తిగావున్న అందరి హృదయాలలో తిరిగి అశాంతి చెలరేగింది.

ఇంత సంపదను గడించిన తరువాత తిరిగి అసలు ఏ దేశమన్నా చేరగలమా, లేదా? అనే అనుమానంతో అల్లాడిపోసాగారు.

"ప్రొఫెసర్, యీ జలాంతర్గామి ఇండియానే చేరనక్కరలేదు. ప్రపంచంలోని ఏ దేశం చేరినా బాధలేదు. ఈ సంపదతో హాయిగా కాలం గడపవచ్చును" దిగాలుగా అన్నాడు మస్తాన్.

"అవును మస్తాన్! నేనూ అందుకే ప్రయత్నిస్తున్నాను" చిన్నగా నిట్టూరుస్తూ అన్నాడు ధనంజయ.

ధనంజయలో అంతకుముందు కన్పించిన దర్పం, హోదా ఇప్పుడు లేవు. కళ్ళలో బ్రతుకుపై కాంక్ష, సుఖజీవితంపై

ఆశమాత్రం మినుకుమినుకు మంటున్నాయి.

"డియర్, పోనీ ఒక పనిచేస్తే?" అడిగింది సునీత.

ఏమిటన్నట్లు సునీతవైపు చూశారు అంతా.

"మనం మానవ ప్రపంచాన్ని చేరుకోలేని ఎడల, ఒక మంచి దీవిని ఎన్నుకొని, ఆ దీవిలోనే సుఖజీవనాన్ని సాగిద్దాం" చెప్పింది.

అయితే ఆ సూచనను చాలామంది నిరాకరించారు.

జీవించడానికి కావలసినది, తిండి, డబ్బేకాదు. సెక్స్ కూడా కావాలి. అందులో నలభైమంది వ్యక్తులలో ఇద్దరికే భార్యలు వున్నారు. మిగిలినవారు?

అందుకే చాలామంది సభ్యులు యీ సూచనను నిష్కర్షగా తిరస్కరించారు.

"సారీ మాడం! ఏదో ఒక సంవత్సరమంటే సముద్రయానానికి ఒప్పుకున్నాం కానీ, జీవితాంతమంటే ఒప్పుకొనే వాళ్ళం కాదు. మాకూ భార్యా బిడ్డలు వారిమీద మమకారాలూ వున్నాయి. ఈ సంపదను అందుకోవడానికి వచ్చింది వాళ్ళను సుఖపెట్టడానికేగానీ, ఇలా అజ్ఞాతంగా వుండిపోవడానికి కాదు" దృఢంగా చెప్పాడు కెప్టెన్ రంజిత్.

"చూడండి కెప్టెన్, మీరంటున్నది నిజమే! అయితే ప్రస్తుత పరిస్థితిని గూడా మీరు ఆలోచించాలి. మనం ఆ నిర్ణయానికి ఎందుకు వచ్చాం? మన దేశాన్ని చేరుకోనేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం కాబట్టే గదా! కాబట్టి సునీతగారి మాటలను కూడా తీసివేయడానికి వీల్లేదు" బేగం ముంతాజ్ అంది.

మరికొంతమంది సభ్యులు తమ తమ వాదనలను విన్పించారు.

అందరి అభిప్రాయాలు విన్న తరువాత ప్రొఫెసర్

గొంతు సవరించుకొని గంభీరంగా చెప్పాడు.

"డియర్ ఫ్రెండ్స్! ప్రపంచంలో ఇంతకుముందు ఎవరూ పూనుకోనటువంటి సాహస కార్యానికి మనం నడుం కట్టాం. అద్భుతమైన వ్యూహ రచనతో బృహత్పథకాన్ని రూపొందించాం. ఆ పథకం దిగ్విజయాన్ని సాధించింది. అనుకున్న ప్రణాళికలను మించి సంపదను సేకరించాం. అయితే, అతిముఖ్యమైన యాంత్రిక లోపం వలన మనం ఒక గడ్డు పరిస్థితిలో చిక్కుకున్నాం.

దిక్సూచిమీటర్ చెడిపోవడం వలన, అనంత సాగర గర్భంలో అనూహ్య పరిస్థితులమధ్య ఏంచేయాలో తోచని పరిస్థితులలో చిక్కుకొని వున్నాం.

ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రతి ఒక్కరికీ తన అభిప్రాయాలను వెల్లడించుకొనే హక్కు వుంది. మీ అందరి అభిప్రాయాలను శ్రద్ధగా వింటాను.

మాతృదేశం చేరుకోవాలని, మనం సంపాదించిన సంపదను పదిమందికి గొప్పగా చూపి, దానిని సద్వినియోగం చేయాలని అనుకోవడంలో తప్పులేదు.

కానీ ఎలా? మాతృదేశం కాదుగదా మరో దేశమేదైనాసరే, సురక్షితంగా చేరే మార్గం వుందా?

లేదు. దైవంపై భారంవేసి ఆరునెలలబట్టి ప్రయాణిస్తున్నాం. గమ్యం కనబడటంలేదు. అందువలన మిత్రులు కొందరు బాధపడటం సహజం. ఇదే సమయంలో కొందరికి సముద్రంపైనే విసుగు పుడుతోంది.

ఈ సమయంలో ఏంచేయాలి? కొందరు చెప్పినట్లు ఏదైనా దీవి మీద నివాసాన్ని ఏర్పాటు చేసుకోవడం సమంజసమేనా? కేవలం ఒక దీవి మీద మనం నివాసం ఏర్పరచుకో దలచుకొంటే, మనం ఇంత శ్రమపడటం, ఇంత సంపదను సేకరించడం వ్యర్థం. మారుమూల దీవిలో

యీా సంపదకు విలువ వుండదు.

అందుకే అన్ని విషయాలు కూలంకషంగా చర్చించి ఈ నిర్ణయానికి వచ్చాను. జాగ్రత్తగా వినండి.

ప్రస్తుతం ఏదైనా మంచి దీవిని ఎన్నుకొని, అక్కడ నివాసాన్ని ఏర్పాటు చేసుకుందాం. ఆ తరువాత వంతుల వారీగా సముద్రంపై ప్రయాణం చేస్తూ, ఏదైనా ఓడ కనబడుతుందేమో వెదకడం ప్రారంభించాలి. మన అదృష్టం బాగుంటే, ఏదో ఓడ కనబడకపోదు. ఆ కెప్టెన్‌కు కొంత బంగారం ఆశచూపి, మన దేశం చేరుకుందాం” విపులంగా చెప్పాడు ధనంజయ.

ప్రొఫెసర్ మాటను విమర్శించడానికి ఎవరికీ పాయింట్స్ కన్పించలేదు.

అంతా మౌనం దాల్చారు. ఆ మౌనాన్ని అంగీకారంగా తీసుకొన్నాడు ధనంజయ.

“మిస్టర్ రంజిత్, ప్రస్తుతం జలాంతర్గామి ఎంత లోతులో ప్రయాణిస్తోంది?” అడిగాడు.

మానో మీటర్ వైపు చూసి చెప్పాడు కెప్టెన్.

“300 అడుగుల లోతులో ప్రయాణిస్తోంది.”

“వెల్. వెంటనే వాటర్ బాక్స్‌లను ఖాళీ చేయించండి. సబ్‌మెరీన్ పైకిరాగానే మంచి దీవికోసం అన్వేషించండి” చెప్పాడు ధనంజయ.

“అలాగే బాస్!” సరంగులవైపు నడిచాడు కెప్టెన్.

అదే సమయంలో ఒక్కసారిగా జలాంతర్గామి కంపించిపోయింది. పెద్ద పెద్ద వురుములు కర్ణభేరులను బ్రద్దలుచేస్తూ వినబడ్డాయి.

అంతా అదిరిపోయారు. కెప్టెన్ పరుగు పరుగున వచ్చాడు.

"వాట్ హేపెండ్?" కంగారుగా అడిగాడు ప్రొఫెసర్.

"సముద్ర కంపం బాస్! ఊహించని విధంగా వచ్చింది. గత్యంతరం లేక జలాంతర్గామిని ఆపు చేశాను" చిన్నగా వణుకుతున్నాడు కెప్టెన్.

"మైగాడ్! జలాంతర్గామిని ఎందుకాపు చేశావ్? సముద్ర కంపమొస్తే ఏమవుతుందో తెలుసా?" ఆందోళనగా అంటూ కాబిన్‌లోకి పరిగెత్తాడు ధనంజయ.

అప్పటికే అంతా అయిపోయింది. ప్రివ్యూమిర్రర్స లోంచిబయటకు చూసిన కెప్టెన్, ప్రొఫెసర్‌లు అదిరిపోయారు.

జలాంతర్గామి చుట్టూ పెద్దపెద్ద రాళ్ళగుట్టలు. బహుశా పైన కూడా పడేవుంటాయి.

వాటర్ బాక్స్‌లను ఖాళీ చేయించి మెషిన్స్‌ను రన్ చేయించాడు ప్రొఫెసర్.

కానీ ఫలితం లేకపోయింది, జలాంతర్గామి వీసమెత్తు కూడా పైకి లేవలేదు.

అంతా ఆందోళనగా కేబిన్‌లోకి చేరుకున్నారు.

"నౌ వుయ్ ఆర్ ట్రాప్‌డ్!" అందరివైపు చూస్తూ చెప్పాడు ధనంజయ.

"మీరనేది నా కర్థం కావడంలేదు" కంగారుగా అన్నాడు మస్తాన్.

"సముద్ర కంపంలో చిక్కుబడిపోయింది మన జలాంతర్గామి. చుట్టూ, పైన కొండలు విరచుకు పడిపోయినవి. వీటిని చీల్చుకొని పైకిపోవడం మన కిక సాధ్యపడదు. మనం నిర్మించుకున్న సబ్ మెరీన్‌లోనే మనం సజీవ సమాధి అయిపోయాం. ఇక సబ్ మెరీన్‌లో ఆక్సిజన్

స్టాక్ ఎంతవరకు వస్తే, అంతవరకే మన జీవనం'' తాపీగా చెప్పాడు ధనంజయ.

ఆ మాట వినగానే అంతా నిశ్చేష్టులైపోయారు.

''అయితే ఆక్సిజన్ ఇంకా ఎంతసేపు వస్తుంది?'' పేలవంగా అడిగాడు మస్తాన్.

''మరో గంట రావచ్చు'' చెప్పాడు ప్రొఫెసర్.

''మరి ఏంచేద్దాం?'' అడిగారు అంతా ఒగ్గరగా ఆందోళనపడుతూ.

చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్. ఆ నవ్వులో నిరాశ, నిస్పృహ ఇమిడి వున్నాయి.

''ఇక మనం బ్రతికి బయటపడే ఆశ లేదు. మీరంతా మీ మీ డైరీలు బయటకు తీయండి. ఇప్పటివరకు జరిగిన సంఘటనలను వివరంగా వివరిస్తూ వ్రాయండి. చివరలో మళ్ళీ యీ సంపదకొరకు ఎవరినీ అన్వేషించవద్దని విజ్ఞప్తి చేయండి. అంతా పూర్తయిన తరువాత ఒక్కొక్క డైరీ ఒక్కొక్క ట్యూబులో పెట్టి సీలువేసి సముద్రంలో వదలండి.

''కాలగర్భంలో కొన్ని సంవత్సరాలు గడిచిన తరువాత యీ సముద్ర గర్భంలో కూడా మార్పులు సంభవిస్తాయి. కొన్ని కొండలు యీ సముద్ర ప్రవాహంలో చెల్లాచెదురయినప్పుడు, మన డైరీలలో కొన్నయినా పైకి తేలి, అలలమధ్య ప్రయాణంచేసి ఎవరికయినా దొరకవచ్చు. కనీసం ఆ విధంగానైనా మన గురించి పదిమందికి తెలుస్తుంది'' తన డైరీ అందుకుంటూ నిస్పృహగా చెప్పాడు ప్రొఫెసర్ ధనంజయ.

—:ఐపోయింది:—